## మట్కా నిందితుడి అరెస్టు

ఎదులాపురం, మార్చి 21 : ఆదిలాబాద్‌లోని స్పిన్నింగ్ మిల్లు ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్న షేక్ రఫిక్‌ను గురువారం అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.11.100 నగదు మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో అతనిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ మద్యం పట్టివేత




పట్టుకున్న మద్యం సీసాలతో పోలీసులు

భీంపూర్, మార్చి 21 : భీంపూర్ మండలం నిపాని, పిప్పల్‌కోటి గ్రామాల్లో పోలీసులు బుధవారం రాత్రి రూ.13,690 విలువ గల అక్రమ మద్యం పట్టుకున్నారు. బాధ్యులపై కేసులు నమోదు చేశారు. ఈ దాడులలో ఎస్ఐ ప్రదీప్‌కుమార్, సిబ్బంది ముంతాజ్, స్వామి, కీరు, శివాజీ, సుభాష్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

ఇచ్చోడ, మార్చి 21 : రైతులు తమ పశువులను కాపాడుకునేందుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు వైద్య సిబ్బంది అన్నారు. గురువారం అడిగామ(కే) గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది శేఖర్, దేవ్‌రావ్, రైతులు పాల్గొన్నారు.

నార్నూర్, మార్చి 21 : పశువులు వ్యాధుల బారినపడకుండా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి రజనీకాంత్ రైతులకు సూచించారు. గుంజాల గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేసే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు, సిబ్బంది ప్రభాకర్, సునీల్, కైలాస్, ఓంకార్, రైతులు పాల్గొన్నారు.

## ముగిసిన సిరిచెల్మ జాతర

ఇచ్చోడ, మార్చి 21 : సిరిచెల్మ గ్రామంలోని మల్లన్నదేవుని జాతర గురువారం ముగిసింది. ముగింపు సందర్భంగా ఉమ్మడి జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి మల్లన్న దేవుడిని దర్శించుకున్నారు. బుధవారం అర్ధరాత్రి ఆలయ ప్రాంగణంలో అగ్ని గుండ ప్రవేశ కార్యక్రమం నిర్వహించగా భక్తులు అగ్నిగుండంలో నడిచారు. ఎస్ఐ నరేశ్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

## నేడు, రేపు రైతు బజార్ మూసివేత

ఎదులాపురం, మార్చి 21 : రైతు బజారులో పారిశుధ్య నిర్వహణ పనులు ఉన్నందున శుక్ర, శనివారం మూసివేస్తున్నామని జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని పట్టణ ప్రజలు గమనించాలన్నారు.

## షీటీం సేవలపై అవగాహన

తాంసి(తలమడుగు), మార్చి 21 : మహిళలకు రక్షణ కల్పించడమే షీటీం లక్ష్యమని షీటీం సభ్యురాలు సుశీల అన్నారు. ఖోడద్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీటీం సేవలపై అవగాహన కల్పించారు. ఆకతాయిలు వేధిస్తే షీటీం, పోలీసులకు సమాచారం అందిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఫిర్యాదులను 8712659953 ఫోన్ నంబర్‌కు చేయవచ్చని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, ఉపాధ్యాయులు, షీటీం సిబ్బంది సత్యమోహన్, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, CHEERLA TIRUPATI, R/o. 23-225/1-117, Road No. 2, Surya Nagar, Chunnambatti Wada, Mancherial, TS. Changed My Name as CHEERLA THIRUPATHI REDDY, S/o. Malla Reddy.
NT-328435

★I, CHEERLA JYOTHI, R/o. 23-225/1-117, Road No. 2, Surya Nagar, Chunnambatti Wada, Mancherial, TS. Changed My Name as CHEERLA LALITHA, W/o. Thirupathi Reddy.
NT-328435

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

# ఉపాధి పనులపై కూలీల అనాసక్తి..!

- నార్నూర్, గాదిగూడ మండలాల్లో 19,139 జాబ్ కార్డులు
- ప్రస్తుతం రోజూ సుమారు 4వేల మంది హాజరు
- కూలీల సంఖ్య పెంచాలని అధికారుల ఆదేశాలు



మాన్కాపూర్‌లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

నార్నూర్, మార్చి 21 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లేందుకు నార్నూర్, గాదిగూడ మండలాల్లోని కూలీలు అంతగా ఆసక్తి చూపడం లేదు. కూలీల సంఖ్య పెంచాలని జిల్లా అధికారులు కిందిస్థాయి సిబ్బందిపై ఒత్తిడి తీసుకొచ్చి పదేపదే చెబుతున్నా కూలీల సంఖ్య మాత్రం పెరగడం లేదు. అందుకు ప్రధాన కారణం పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి వేతనాలు అందకపోవడమేనని పలువురు కూలీలు వాపోతున్నారు. సాధారణంగా బయట ఏ పనికి వెళ్లినా కనీసం రోజుకు రూ.500 వరకు వస్తుంది. కానీ అదే ఉపాధి హామీ పనులకు వెళ్లే వారికి రోజుకు కనీసం రూ.300 కూడా రావడం లేదని చెబుతున్నారు.

### రోజుకు 4వేల మంది మాత్రమే హాజరు...

రెండు మండలాల వ్యాప్తంగా ఉన్న 48 గ్రామాల్లో దాదాపు 44,814 కుటుంబాలు ఉన్నాయి. అందులో 19,139 కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉన్నాయి. ఆ జాబ్‌కార్డుల ద్వారా 25,809 మంది ఉపాధి హామీ పనులు చేసుకునే అవకాశం ఉంది. ప్రతి ఏటా 13,740 మంది ఉపాధి హామీ పనులకు హాజరవుతున్నారు. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 4 వేల నుంచి 5 వేల మంది మాత్రమే పనులకు వస్తున్నారు.

### రూ. 272 అందేలా ప్రణాళిక...

నిర్ణీత కొలతల ప్రకారం కూలీలు పని చేస్తే రోజుకు కనీసం రూ.272 అందేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. 15 రోజుల క్రితం నార్నూర్, గాదిగూడ మండలాల వ్యాప్తంగా కేవలం 4వేల నుంచి 4500 మంది కూలీలు మాత్రమే ఉపాధి హామీ పనులకు వచ్చేవారు. 15 రోజులుగా కందకం తవ్వక పనులు ప్రారంభించారు. కొలతల ప్రకారం దీంతో రోజుకు రూ.250 వరకు అందుతోంది. ప్రస్తుతం నార్నూర్‌లో 2500, గాదిగూడలో 2500 మంది కూలీలు పనులకు వస్తున్నట్లు ఈజీఎస్ అధికారులు చెబుతున్నారు. గతంలో వలే కూలీలు పనులకు వచ్చే అవకాశం కనిపించడం లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజుకు కనీసం రూ.400 వేతనం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు.

### రోజు రూ.400ఇస్తే బాగుండు



పెరిగిన ధరలకు అనుగుణంగా రోజుకు కనీసం రూ.400 వేతనం ఇస్తే బాగుండు. గతేడాది రోజుకు రూ.190 మాత్రమే వచ్చాయి. వారం రోజులుగా సీసీటీ పనులు చేస్తున్నాం. కనీసం రూ.272 వేతనం వచ్చేలా చూడాలి. అదే బయటి పనులకు వెళ్తే రోజుకు రూ.500 వస్తాయి. -మెస్రం మోతీరాం, ఉపాధి హామీ కూలీ

### కొలతల ప్రకారం వేతనం అందిస్తున్నాం..



ఉపాధి హామీ పనులకు వచ్చిన కూలీలకు చేసిన పనికి కొలతల ప్రకారం వేతనం అందిస్తున్నాం. నిర్ణీత పని చేస్తే ప్రతి కూలీకి రూ.270 వేతనం వస్తుంది. తక్కువ పని చేస్తే తక్కువ వేతనం వస్తుంది.
-పవార్ నితిన్, ఈజీఎస్ ఏపీవో, గాదిగూడ మండలం

# పోలింగ్ కేంద్రాలను సందర్శించాలి

- బోథ్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఖుష్బూ గుప్తా



మాట్లాడుతున్న బోథ్ ఆర్వో ఖుష్బూగుప్తా

బోథ్, మార్చి 21 : బోథ్ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సెక్టోరల్ అధికారులు సందర్శించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా సూచించారు. గురువారం బోథ్‌లోని తహసీల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ కేటాయించిన రూట్లలో సెక్టోరల్ అధికారులు వసతులు పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో నీటి వసతి, వాహనాలు వెళ్లేందుకు వీలుందా లేదా తదితర అంశాలను పరిశీలించాలన్నారు. ఏమైనా సమస్య ఉంటే వెంటనే తెలపాలన్నారు. కార్యక్రమంలో బోథ్ తహసీల్దార్ సుభాష్‌చంద్ర, ఎనిమిది మండలాల తహసీల్దార్లు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

# సిరికొండకు బస్సు వచ్చిందోచ్..

ఇచ్చోడ(సిరికొండ), మార్చి 21 : వారం రోజుల నుంచి సిరికొండకు బస్సుకు నడపక పోవడంతో నమస్తే తెలంగాణలో ఈ నెల 20వ తేదీన బస్సు వేయండి సార్ అనే కథనం ప్రచురితమైంది. దీంతో ఆదిలాబాద్ డిపో ఆర్టీసీ అధికారులు స్పందించి గురువారం బస్సు ప్రారంభించారు. ఉదయం ఒక ట్రిప్పు, మధ్యాహ్నం ఒక ట్రిప్పు నడిపారు. దీంతో మండల వాసులు బస్సు సమస్య పరిష్కారం కావడంతో నమస్తే తెలంగాణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



సిరికొండ మండలానికి వచ్చిన బస్సు

# పదో తరగతి పరీక్షా కేంద్రం పరిశీలన



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ రూరల్, మార్చి 21: ఆదిలాబాద్‌లోని పలు పరీక్షా కేంద్రాలను గురువారం కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి సందర్శించారు. ప్రభుత్వ బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట ఎంఈవో జయశీల ఉన్నారు.

### పరీక్షలపై ఫేక్ సమాచారాన్ని నమ్మకండి

పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని, ఎటువంటి మాస్ కాపియింగ్ జరగడం లేదని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉట్నూర్‌లోని ఓ పరీక్షా కేంద్రం నుంచి పదో తరగతి ప్రశ్నాపత్రం బయటకొచ్చిందనే ఫేక్ న్యూస్‌ను ఖండించారు. సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని అన్నారు. ఫేక్ సమాచారాలపై పోలీసు అధికారులు దృష్టి సారించారని తెలిపారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

# గంగపుత్రుల ఆర్థిక పరిపుష్టికి కృషి

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

భీంపూర్, మార్చి 21 : గంగపుత్రుల ఆర్థిక పరిపుష్టికి మరింత కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామ గంగపుత్ర సంఘం ఎన్నికైన తర్వాత సభ్యులు గురువారం నేరడిగొండకు వెళ్లి ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రింగని వసంత్, ఉపాధ్యక్షుడు విలాస్, ప్రధాన కార్యదర్శి ఇప్పనందును ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ సార్ చెరువులు, కుంటల పునరుద్ధరణ చేసి గంగపుత్రులకు ఎంతో చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జాదవ్ అనిల్ యువసేన అధ్యక్షుడు షేక్ అఫ్రోజ్, నాయకులు నారాయణ, వసంత్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.



భీంపూర్ : ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌తో గంగపుత్రులు

### మండలాభివృద్ధికి కృషి చేస్తా

తాంసి(తలమడుగు), మార్చి 21: తలమడుగు మండలాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారని బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్ తెలిపారు. తలమడుగు మండలం దేవాపూర్ నుంచి లచ్చంపూర్ వరకు, కజ్జర్ల నుంచి పొన్నారి, కజ్జర్ల నుంచి ఖోడద్ గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయాలని నేరడిగొండలో ఎమ్మెల్యేకు విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గజానన్, రాజేశ్వర్, పొచ్చన్న, రమేశ్, ప్రకాశ్ పాల్గొన్నారు.

# అడవులతోనే మనుగడ



ఉట్నూర్‌రూరల్: బైక్ ర్యాలీ తీస్తున్న అటవీ శాఖ అధికారులు

ఉట్నూర్ రూరల్, మార్చి 21 : మానవాళి మనుగడ కోసం అడవులను సంరక్షించాలని బీర్సాయిపేట అటవీ రేంజ్ అధికారి గులాం మొయినుద్దీన్ అన్నారు. గురువారం బీర్సాయిపేట గ్రామంలో ప్రపంచ అటవీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అటవీ శాఖ అధికారులు బీర్సాయిపేట నుంచి ఉట్నూర్ వరకు బైక్ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల నరికివేత కారణంగా పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందన్నారు. మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని పేర్కొన్నారు. చెట్లతో ప్రాణవాయువు విడుదలవుతుందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో అరుణ, ఎఫ్ఎస్‌వోలు, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### అడవుల, జీవుల రక్షణకు కృషి చేయాలి

ఇంద్రవెల్లి, మార్చి 21: అడువుల, జీవుల రక్షణ బాధ్యత అందరిపై ఉందని జిల్లా బయోడైవర్సిటీ కోఆర్డినేటర్ సోన్‌కాంబ్లే గోపీనాథ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సన్‌షైన్ పాఠశాలలో విద్యార్థులకు జీవ వైవిధ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంద్రవెల్లి పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్, జిల్లా బయోడైవర్సిటీ కోఆర్డినేటర్ సోన్‌కాంబ్లే గోపీనాథ్ మాట్లాడుతూ జీవ రాసులతో పాటు జీవ వైవిధ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. అన్ని రకాల మొక్కలతో పాటు చెట్లను పెంచాలన్నారు. కార్యక్రమంలో సన్‌షైన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య, ఇంద్రవెల్లి మాజీ ఉపసర్పంచ్ గణేశ్, హెల్త్ అసిస్టెంట్ జాదవ్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్

ఎదులాపురం, మార్చి 21 : ఆకస్మాత్తుగా ఎవరికైనా గుండెపోటు వస్తే సీపీఆర్ చేసి ప్రాణాలు నిలబెట్టాలని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ అన్నారు. గురువారం రిమ్స్ నర్సింగ్ కళాశాల వైద్య విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ప్రాణాపాయంలో ఉన్న వారిని కాపాడాలని పేర్కొన్నారు. రెండు రోజులు పాటు సాగే శిక్షణ కార్యక్రమాన్ని వైద్యవిద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిమ్స్ వైస్ ప్రిన్సిపాల్ విద్యావిల్సన్, నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శకుంతల, సిబ్బంది శ్రీదేవి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# ప్రతి శిశువుకూ ముర్రుపాలు తాగించాలి



ఎదులాపురం : తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో వనజ, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్

ఎదులాపురం, మార్చి 21 : పుట్టిన గంటలోపు ప్రతి శిశువుకూ ముర్రుపాలు తాగించాలని అర్బన్ సీడీపీవో వనజ సూచించారు. పోషణ పక్షోత్సవాలను పురస్కరించుకొని గురువారం రిమ్స్‌లో గర్భిణులు, బాలింతల వార్డులో తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ శిశువుకు ఆరు నెలల వరకు తల్లి పాలు తాగించాలన్నారు. తల్లి పాలు బిడ్డలో వ్యాధినిరోధక శక్తి పెరుగుదలకు దోహదపడతాయన్నారు. మహిళలు గర్భందాల్చినప్పటి నుంచి అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రంలోనే వైద్యసిబ్బంది టీకాలు వేస్తారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఫర్హా, అంగన్‌వాడీ టీచర్ రాధ, తదితరులు పాల్గొన్నారు.

### చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

నార్నూర్, మార్చి 21 : చిరు ధాన్యాలతో తల్లులు, పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వందన అన్నారు. గురువారం జామడ గ్రామంలోని ప్రభుత్వ ఆదర్శ సైన్స్ పాఠశాలలో పోషణ పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్, ఉపాధ్యాయులు, కిశోర బాలికల ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. చిరుధాన్యాలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ నెహ్రూ, పీడీ విశ్వనాథ్, ఎంపీహెచ్‌సీ రాజమ్మ, ఏఎన్ఎం సుశీల, అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి విగ్రహావిష్కరణ వేడుకలు



పూజలకు హాజరైన మహిళలు

బోథ్, మార్చి 21: కౌట(బీ) గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహావిష్కరణలో భాగంగా గురువారం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. శుక్రవారం పెద్దమ్మ తల్లి, పోతారాజు జంటనాగుల విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రాణ ప్రతిష్ఠా చేయనున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

ఇంద్రవెల్లి, మార్చి 21: పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఎస్ఐ సునీల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, గిరిజన ఆశ్రమోన్నత బాలిక పాఠశాలలోని పరీక్షా కేంద్రాలను ఎస్ఐ సునీల్ తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులు మాస్ కాపియింగ్‌కు పాల్పడితే సంబంధిత ఇన్విజిలేటర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## గొడుగులు పంపిణీ

ఇచ్చోడ, మార్చి 21 : మండల కేంద్రంలో శ్రీ సంత్ రవిదాస్ మహారాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం మోచి కులస్తులకు ఎండ గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గంగాసాగర్ రవి, ఉపాధ్యక్షుడు ఆదేశ్, కార్యదర్శి మారుతి, సభ్యులు సంతోష్ పాల్గొన్నారు.

## ముగిసిన సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ

ఆదిలాబాద్ రూరల్, మార్చి 21: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో మూడు రోజుల నుంచి టీఎస్ కేసీ విభాగం ఆధ్వర్యంలో టాస్క్ వారు నిర్వహిస్తున్న సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ 21వ శతాబ్దంలో విద్యార్థులు స్థిరపడాలంటే తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసే ఇలాంటి శిక్షణ కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. శిక్షణలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నైపుణ్యాలను చూసి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల టీఎస్ కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ నర్సింగరావ్, మెంటర్ ఎండీ ఇమ్రాన్ అలీ, అధ్యాపకులు, టాస్క్ ట్రైనర్ రామ మనోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్

## డయల్ యువర్ డీఎంకు స్పందన



మాట్లాడుతున్న ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన

ఆదిలాబాద్ రూరల్, మార్చి 21 : డయల్ యువర్ డీఎం కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలు, అర్జీలను పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తామని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన తెలిపారు. గురువారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఫిర్యాదులు, సలహాలు అందజేశారు. ఈ మేరకు వచ్చిన ఫిర్యాదులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు బస్సులు నడిపిస్తామన్నారు.

## కార్మికులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న రీజినల్ మేనేజర్ సోల్మన్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 21 : ఎండ తీవ్రత నేపథ్యంలో టీఎస్ ఆర్టీసీ ఎండీ ఆదేశాల మేరకు గురువారం మధ్యాహ్న సమయంలో ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో ఉద్యోగులకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ సోల్మన్ మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంవో ప్రణీత్, ఆర్ఎంఎం ప్రవీణ్‌కుమార్, డిపో మేనేజర్ కల్పన పాల్గొన్నారు.

## శబరిమాత విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు



శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు

బోథ్, మార్చి 21 : కన్నగుట్ట గ్రామంలో శబరిమాత విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆశ్రమంలో హోమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో అమ్మవారి పాదకులు, చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఊరేగించారు. ఆశ్రమంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. కార్యక్రమానికి గ్రామంతో పాటు ధన్నూర్(బీ), కౌఠ(బీ), తేజాపూర్, గిర్నూర్, సుంకిడి గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.